కృష్ణ శతకము

SL NO. 724

13685

శ్రీ

కృష్ణశతకము

పబ్లిషర్సు:-

మారుతీరాం అండ్ కో.,

హెడ్డాఫీసు:— బెజవాడ.

రజత ముద్రాక్షరశాల, తెనాలి.

1923

OFFICE OF THE R... 17 JUL 1925 MADRAS

724/11646

వెల 1 అణా.

శ్రీరస్తు,

శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః

కృష్ణశతకము.

క. శ్రీరుక్మిణీశ కేశవ
నారదసంగీతలోల నగధరశౌరీ
ద్వారకనిలయ జనార్దన
కారుణ్యముతోడ మమ్ము గావుము కృష్ణా. 1

క. నీవేతల్లివి దండ్రివి
నీవేనాతోడునీడ నీవేసఖుడౌ
నీవేగురుడవు దైవము
నీవేనాపతియు గతియు నిజముగ కృ. 2

క. నారాయణ పరమేశ్వర
ధారాధర నీలదేహ దానవవైరీ
క్షీరాబ్ధిశయన యదుకుల
వీరా ననుగావు కరుణ వెలయగ కృ. 3

క. హరియను రెండక్షరములు
హరియించును పాతకముల నంబుజనాభా
హరినీనామ మహత్త్వము
హరిహరి బొగడంగ వశమె హరి శ్రీ కృ.

క. క్రూరాత్ము డజామిళుడు
నారాయణయనుచు నాత్మ నందను బిలువ
న్నేరీతి నేలుకొంటివి
యేరీ నీసాటి వేల్పు లెందున కృ.

క. చిలుకల కొలికియు ముద్దుల
చిలుకను శ్రీరామ యనుచు శ్రీపతి పేరం
బిలిచిన మోక్షము నిచ్చితి
నలరగ మిముదలచు జనుల కరుదా కృ.

క. అక్రూర వరద మాధవ
చక్రాయుధ ఖడ్గపాణి శౌరి ముకుందా
శక్రాది దివిజ సన్నుత
శుక్రార్చిత నన్ను గరుణ జూడుము కృ.

క. నందుని ముద్దుల పట్టిని
మందరగిరిధరుని హరిని మాధవు విష్ణున్
సుందర రూపుని మునిగణ
వందితు మిము దలతు భక్తవత్సల కృ. 8

క. ఓకారుణ్య పయోనిధి
నా కాధారంబవగుచు నయముగ బ్రోవ
న్నా కేల యితర చింతలు
నాకాధిప వినుత లోకనాయక కృ. 9

క. వేదంబులు గననేరని
యాదిపరబ్రహ్మమూర్తి యనఘమురారీ
నాదిక్కు జూచిగావుము
నీదిక్కే నమ్మినాడ నిజముగ కృ. 10

క. పదునాలుగు భువనంబులు
కుదురుగ నీకుక్షినిల్పుకొననేర్పరివై
విదితంబుగ యాదేవకి
యురదములో నెట్లొదిగియుంటివి కృ. 11

క. అష్టమిరోహిణి ప్రొద్దున
యష్టమగర్భమునబుట్టి యాదేవకికిం
దుష్టుని కంసువధింపను
సృష్టిప్రతిపాలనంబు సేయగ కృ. 12

క. అల్లజగన్నాథునికే
పల్లియ క్రీడార్థమయ్యె పరమాత్మునకున్
గొల్లసతి యాయశోదయు
తల్లియునై చన్నుగుడిపె దనరగ కృ. 13

క. అందెలు గజ్జెలు మ్రోయగ
చిందులు ద్రొక్కుచునువేడ్క చెలువారంగా
నందునిసతి యాగోపిక
ముందరనాడుదువు మిగుల మురియుచు కృ. 14

క. హరిచందనంబు మేనున
కరమొప్పెడు హస్తములను కంకణరవమున్
యురమున రత్నముమెరయగ
బరగినడా నీదుబాల్య వయసది కృ. 15

క. పాణితలంబున వెన్నయు
వేణీమూలంబునందు వెలయగపింఛం
బాణీముత్యము ముక్కున
నాణెముగాదాల్చు లోకనాథుడ కృ. 16

క. మడుగుకుజని కాళింగుని
పడగలపై భరతశాస్త్ర పద్ధతివెలయం
గడువేడుకతో నాడెడు
నడుగులు నేమదినిదలతు నచ్యుత కృ. 17

క. బృందావనమున బ్రహ్మా
నందార్భకమూర్తి వేణునాదమునీవున్
మందారమూలమున గో
విందా పూరింతువార వేడుక కృ. 18

క. వారిజనేత్రులు యమునా
వారిని జలకంబులాడ వచ్చిననీవున్
చీరలు మ్రుచ్చిలియిచ్చితి
నేరుపురా యిదియునీకు నిజముగ కృ. 19

క. దేవేంద్రు డలుకతోడను
వావిరిగా రాళ్ళవాన వడిగురియింపం
గోవర్ధనగిరి యెత్తితి
గోవుల గోపకులగాచు కొరకై కృ. 20

క. అండజవాహన విను బ్ర
హ్మాండంబుల బంతులాట యాడెడునీవుం
గొండల నెత్తితి వందురు
కొండికపనిగాక దొడ్డకొండా కృ. 21

క. హంసాలంబితకుండల
కంసాంతకనీవు ద్వారకాపురిలోనన్
సంసారిరీతినుండి ప్రి
శంసార్హుఁడ వైతివహహ జగతిని కృ॥ 22

క. పదియారువేల నూర్వురు
సుదతులు నెనమండ్రునీకు సొంపుగభార్య
ల్విదితంబుగ బహురూపుల
వదలక భోగించుదైత్యవైరివి కృ॥ 23

క. అంగనపనుపున ధోవతి
కొంగున నటుకులనుముడుచుకొనివచ్చిన యా
సంగతివిని దయనొసగితి
రంగుగ సంపదలు లోకరక్షక కృ॥ 24

క. హా వసుదేవకుమారక
కావుమునామానమనుచు కామినివేడ
న్నావనజాక్షికి నిచ్చితి
శ్రీవరయక్షయమటంచు చీరలు కృ॥ 25

క. శుభ్రమగు పాంచజన్యము
అభ్రంకష పగిది మ్రోవ నాహవభూమిన్
విభ్రమలగు దనుజసుతా
గర్భంబులు బగులచేయు ఘనుడవు కృ॥ 26

క. జయమును విజయునికియ్యవె
హయముల ములుకోలమోపి యదలించి మహా
రయమున రొప్పవె తేరును
భయమున రిపుసేనవిరిగి పారగ కృ॥ 27

క. దుర్జనులగు నృపసంఘము
నిర్జింపగదలచినీవు నిఖిలాధారా
దుర్జనులను వధియింపను
నర్జును రథచోదకుండ వైతివి కృ॥ 28

క. శక్రసుతుగాచుకొరకై
చక్రముచేపట్టి భీష్ముచంపగ జనుసీ
విక్రమమేమని పొగడుదు
నక్రగహ సర్వలోకనాయక కృ॥ 29

క. దివిజేంద్రసుతుని జంపియు
రవిసుతు రక్షించినావు రఘురాముడవై
దివిజేంద్రసుతునిగాచియు
రవిసుతుబరిమార్చితౌర రణమున కృ॥ 30

క. దుర్భరబాణముగాగా
గర్భములోనుండి యభయకావుమటన్నన్
నిర్భరకృపరక్షించితి
వర్భకు నభిమన్యుసుతుని నచ్యుత కృ॥ 31

క. గిరులందు మేరువౌదువు
సురలందును నింద్రుడౌదు చుక్కలలోన
న్బరమాత్మచంద్రుడౌదువు
నరులందున నృపతివౌదు నయముగ కృ॥ 32

క. చుక్కలు నెన్నగవచ్చును
గ్రక్కునభూరేణువులను గణుతింపనగున్
జొక్కపునీగుణజాలము
నక్కజమగు లెక్కపెట్టనజునకు కృ॥ 33

క. కుక్షిని నఖిల జగంబులు
నిక్షేపము జేసి ప్రళయ నీరధి నడుము
న్వక్షక వటపత్రముపై
దక్షత పవళించునట్టి ధన్యుడ కృ. 34

క. విశ్వోత్పత్తికి బ్రహ్మవు
విశ్వము రక్షింపదలచి విష్ణుడ వనగా
విశ్వము జెరుపను హరుడవు
విశ్వాత్మక నీవెయగుచు వెలయుగ కృ. 35

క. అగణిత వైభవ కేశవ
నగధర వనమాలి యాది నారాయణ హా
భగవంతుడ శ్రీమంతుడ
జగదీశ్వర శరణు శరణు శరణము కృ. 36

క. మగమీనమవై జలనిధి
పగతుని సోమకుని జంపి పద్మభవునకు
న్నిగమములు దెచ్చి యిచ్చితి
సుగుణాకర మమ్ము గరుణ జూడుము కృ. 37

క. అందరు సురలును దనుజులు
పొందుగ క్షీరాబ్ధి దరువ పొలుపున నీవున్
అందముగ కూర్మ రూపున
మందర గిరి యెత్తితౌర మాధవ కృ. 38

క. ఆది వరాహమయ్యును
నాదనుజ హిరణ్యా నేత్రు హతు జేసితగన్
మోదమున సురలు పొగడగ
మేదిని గడిగొడుగు యెత్తి మెరసితి కృ. 39

క. కెరలి యఱచేత కంబము
నరుదుగ వేయుటను వెడలి యసురేశ్వరునిన్
యురమున జీరి వధించితి
నరహరి రూపావతార నగధర కృ. 40

క. వడుగవునై మూడడుగుల
నడిగితివౌ భళిర భళిర యఖిల జగంబుల్
దొడిగితివి నీదు మేనున
గడుచిత్రము నీచరిత్ర ఘనుడవు కృ. 41

క. ఇరువదొకమార్లు నృపతుల
శిరములు ఖండించితౌర చేగొడ్డంటన్
ధర కశ్యపునకు నిచ్చియు
బరగగ జమదగ్ని రామభద్రుడ కృ. 42

క. దశకంఠుని బరిమార్చియు
కుశలముతో సీత దెచ్చికొనియు నయోధ్య
న్విశదముగ కీర్తినేలిన
దశరథ రామావతార ధన్యుడ కృ. 43

క. ఘనులగు ధేనుక ముష్టిక
దనుజుల చెండాడి తౌర తగ భుజశక్తిన్
అనఘాత్మ రేవతీ పతి
యనగా బలరామమూర్తియౌగద కృ. 44

క. త్రిపురాసుర భార్యల నతి
నిపుణతతో వ్రతముచేత నిలిపిన కీర్తుల్
కపటపు రాజవు భళిరే
కృపగల బౌద్ధావతార ఘనుడవు కృ. 45

క. వలపుల తేజీనెక్కియు
యిలపై ధర్మంబునిలుప హీనుల(దుంపన్
గలియుగము తుదినివేడుక
కలికివిగానున్నలోక కర్తవు కృ॥ 46

క. వనజాక్షభక్తవత్సల
మునులగుమూర్తిత్రయంబు కరుణానిధివై
వినునీసద్గుణజాలము
సనకాదిమునీంద్రు లెన్నజాలరు కృ॥ 47

క. అపరాధ సహస్రంబుల
నపరిమితములైన యఘము ననిశము నేనుం
గపటాత్ముడనై జేసితి
చపలుని ననుగావు శేషశాయివి కృ॥ 48

క. నరపశువు మూఢచిత్తుడ
దురితారంభుడను మిగుల దోషకుడను నే
గురు తెరుగ నెంతవాడను
హరినీవే (ప్రాపుదాపు నౌదువు కృ॥ 49

క. పరనారీ ముఖపద్మము
గురుతుగకుచకుంభములను గొప్పనునడుము
న్నరయముంగనె మోహింతురు
నిరతమునిను భక్తిగొల్వ నేరరు కృ॥ 50

క. పంచేంద్రియమార్గంబుల
గొంచెపుబుద్ధినిచరించి
గొన్నిదినంబుల్ ఇంచుక సజ్జనసంగతి
యంచును మిమ్మెరిగినాడ నిప్పుడె కృ॥ 51

క. దుష్టుండ దురాచారుడ
దుష్టచరిత్రుడను చాలదుర్బుద్ధిని నే
స్రష్టసినుగొల్వనేరను
కష్టుసినను గావుకావు కరుణను కృ॥ 52

క. కుంభేంద్రవరద కేశవ
జంభాసురవైరిదివిజ సన్నుతచరితా
యంభోజనేత్ర జలనిధి
గంభీరతనన్నుగావు కరుణను కృ॥ 53

క. దిక్కెవ్వరుప్రహ్లాదుని
దిక్కెవ్వరు పాండుసుతుల
దీనులకెపుడు న్దిక్కెవ్వరయ్య
హాల్యకు దిక్కెవ్వరు నీవెనాదు దిక్కువు కృ॥ 54

క. హరిని వెదిక్కునాకును
సిరితో నేతెంచిమకరి శిక్షించి
దయం బరమేష్టి సురలుబొగడగ
కరిగాచినరీతి నన్నుగావుము కృ॥ 55

క. పురుషోత్తమ లక్ష్మీపతి
సరసిజగర్భాదిమౌని సన్నుత
చరితా మురభంజన సురరంజన
వరదుడవగునాకు భక్తవత్సల కృ॥ 56

క. క్రతువులు తీర్థాగమములు
వ్రతవులు దానములు సేయవలెనాలక్ష్మీ
పతి మిముదలచినవారికి
నతులిత పుణ్యములుగలుగుటరుదా కృ॥ 57

క. స్తంభమున వెడలిదానవ
డింభకు రక్షించినట్టి రీతిని వెలయు
నంభోజనేత్ర జలనిధి
గంభీరుడ నన్ను గావు కరుణను కృ. 58

క. శతకోటి భానుతేజుడ
యతులిత సద్గుణగణాఢ్య యంబుజనాభా
రతినాధజనకలక్ష్మీ
పతిహితనను గావుభక్తవత్సల కృ. 59

క. మందుడనే దురితాత్ముడ
నిందలకొడిగట్టినట్టి నీమనినన్నున్
సందేహింపక కావుము
నందునిపరపుత్ర నిన్ను నమ్మితి కృ. 60

క. గజరాజ వరద కేశవ
త్రిజగత్కళ్యాణమూర్తి దేవమురారీ
భుజగేంద్రశయన మాధవ
విజయాప్తుడ నన్ను గావు వేడుక కృ. 61

క. గోపాల దొంగమురహర
పాపాలను పారదోలు ప్రభుడవునీవే
గోపాలమూర్తి దయతో
నాపాలిటగలిగి ప్రోవు నమ్మితి కృ. 62

క. దుర్మతి నేబలుకష్టపు
కర్మంబులు జేసినట్టి కష్టుడనన్నున్
నిర్మలుని జేయవలెన ని
ష్కర్ముడ నిను నమ్మినాడ సతతము కృ. 63

క. దుర్వార చక్రధరశర
శర్వాణి ప్రణుతవినుత జగదాధారా
నిర్వాణనాథ మాధవ
సర్వాత్మకనన్ను గావుసరసుడ కృ. 64

క. సుత్రామనుత జనార్దన
సత్రాజిత్తనయనాథ సౌందర్యకళా
చిత్రావతార దేవకి
పుత్రాననుగావు నీకుపుణ్యము కృ. 65

క. బలమెవ్వడు కరిఁబ్రోవను
బలమెవ్వడు పాండుసుతుల భార్యనుగావం
బలమెవ్వడు రవిసుతునకు
బలమెవ్వడు నీవునాదు బలమా కృ. 66

క. పరుసముసోకిన యినుమును
వరుసగ బంగారమైన వడువునజిహ్వాఁ
హరి నీనామముసోకిన
సురవందిత యేనునగుదు సులభుడ కృ. 67

క. ఒకసారి నీదునామము
ప్రకటముగా దలచువారి పాపములెల్లం
వికలములై దొలగుటకును
సకలార్థ యజామిళుండు సాక్షియె కృ. 68

క. హరి సర్వంబునగలడని
గరిమను దైత్యుండు బలుకకంబములోనఁ
యిరువొంద వెడలి, చీలవె
శరణన్న విభీషణుండు సాక్షియె కృ. 69

క. భద్రార్చిత పదపద్మసు
భద్రాగజ సర్వలోక పాలనగుణ శ్రీ
బలభద్రానుజ కేశవ
భద్రాధిప నన్నుబ్రోవు భయహర కృ. 70

క. ఎటువలె కరిమొర వింటివి
ఎటుప్రహ్లాదునకు నభయమిచ్చితి కరుణ
న్నటువలె ననురక్షింపుము
కటకట నినునమ్మినాడ గావుము కృ. 71

క. తటతటలేటికి జేసెదు
కటకట పరమాత్మ నీవు ఘంటాకర్ణున్
ఎటువలె నిపుణుని జేసితి
నటువలె రక్షింపుమయ్య యచ్యుత కృ. 72

క. తురగాధర్వంబు జేసిన
పురుషులకును వేరెపదవి పుట్టుటయేమో
హరి మిము దలచినవారికి
యరుదా కైవల్యపదవి యచ్యుత కృ. 73

క. ఓపుండరీకలోచన
యోభరతాగ్రజ మురారి యోరఘురామా
యోభక్త కామధేనువ
యోభవహర నన్నుగావు మోపిక కృ. 74

క. ఓతండ్రి కనక కశ్యపు
ఘాతకునై యతనిసుతుని కరుణను గాచెం
బ్రీతి సురకోటి బొగడగ
నాతండ్రీ నిన్ను నేనునమ్మితి కృ. 75

క. ఓపుండరీకలోచన
యోపురుషోత్తమ ముకుంద యోగోవిందా
యోపురసంహార మిత్రుడ
యోపుణ్యుడ నన్ను బ్రోవుమో హరి కృ. 76

క. ఏవిభు ఘోరరణంబున
రావణువధియించి లంక రాజుగనిలిపె
దీవించి యావిభీషణు
నావిభునే దలతు నేను నచ్యుత కృ. 77

క. గ్రహభయదోషము బొందదు
బహుపీడలు చేర వెరచు పాయునునఘముల్
ఇహపర ఫలదాయక విను
తహతహ లెక్కడివినిన్ను దలచిన కృ. 78

క. గంగ మొదలైన నదులను
మంగళముగ జేయునట్టిమజ్జనములకుం
సంగతి గలిగిన ఫలములు
రంగుగనిము దలచు సాటిరావుర కృ. 79

క. ఆ దండకావనంబున
కోదండము దాల్చినట్టి కోమలమూర్తీ
నాదండ కాపురమ్మా
వేదండము కాచినట్టివేల్పవు కృ. 80

క. చూపుము నీరూపంబును
పాపపు దుష్కృతములెల్ల పంకజనాభా
పాపుము నాకునుదయతో
శ్రీపతి నిను నమ్మినాడ సిద్ధము కృ. 81

క. నీనామము భవహరణము
నీనామము సర్వసౌఖ్య నివహాకరంబు
న్నీనామ మమృతపూరము
నీనామము నేదలంతు నిత్యుడ కృ. 82

క. పరులను నడిగినజనులకు
కురచసుమీ యదియటంచు గురుతుగనీవు
న్గురుచవు నై వేడితి వే
ధరపాదత్రయముబలిని తద్దయు కృ. 83

క. పాలును వెన్నయు మ్రుచ్చిలి
రోలను మీతల్లి గట్ట రోషము తోడన్
లీలా వినోదివైతివి
బాలుడవా బ్రహ్మగన్న ప్రభుడవు కృ. 84

క. రఘునాయక నీనామము
లఘుమతితో దలచగలనె లక్ష్మీ రమణా
అఘములు బాపుము దయతో
రఘురాముడవైన లోక రక్షక కృ. 85

క. అప్పా యిత్తువు దయతో
నప్పాలను నతిరసంబు లనుభవశాలీ
యప్పా నను గనుగొనవే
యప్పా నను బ్రోవు వేంకటప్పా కృ. 86

క. కొంచపు వాడని మదిలో
నుంచకుమీ వాసుదేవ గోవింద హరీ
యంచితము నీ కరుణకు
కొంచెము నధికంబు గలదె కొంతయు కృ. 87

క. వావిరి నీభక్తులకుం
గావరమున నెగ్గుసేయు గర్వాంధులనుఁ
జేవ వధించుట వింటిని
నీవల్లను భాగ్య మయ్యె నిజముగ కృ. 88

క. అయ్యా పంచేంద్రియములు
నుయ్యాలలను నూచినట్టు లూరక నేనుఁ
జయ్యన దలచుచు నుంటిని
కుయ్యాలింపుము మహాత్మ గురుతుగ కృ. 89

క. కంటికి రెప్ప విధంబున
బంటుగదా యనుచు నన్ను బాయక యెపుడుఁ
జంటయి నీవుండుట నే
కంటకమగు పాపములను గడచితి కృ. 90

క. యమునికి యికనే వెరువను
కమలాక్షు జగన్నివాస కామిత ఫలదా
విమలమగు నీదు నామము
అమరగ దలచెదను వేగ ననిశము కృ, 91

క. దండమయా విశ్వంభర.
దండమయా పుండరీక దళనేత్రహరీ
దండమయా కరుణానిధి
దండమయా నీకునిపుడు దండము కృ. 92

క. నారాయణ లక్ష్మీపతి
నారాయణ వాసుదేవ నందకుమారా
నారాయణ నినునమ్మితి
నారాయణ నన్నుబ్రోవు నగధర కృ. 93

క. తిరుమణి దురితవిదూరము
తిరుమణి సౌభాగ్యకరము త్రిజగములందుఀ
తిరుమణి వెట్టిన మనుజుఁడు
పరమపవిత్రుండు భాగ్యవంతుఁడు కృ. 94

క. దుర్వారచక్రహస్తుఁడ
శర్వాణీవినుతనామ జగదభిరామా
నిర్వాణనాథ మాధవ
సర్వాత్మక నన్నుఁగావు సరసుఁడ కృ. 95

క. శ్రీలక్ష్మి నారాయణ
వాలాయము నిన్నుఁదలతు వందిత చరణా
ఏలుము ననునీబంటుగ
చాలగ నినునమ్మినాను సరసుఁడ కృ. 96

క. శ్రీధర మాధవయచ్యుత
భూధర పురుహూతవినుత పురుషోత్తమ నీ
పాదయుగళంబు నెప్పుడు
మోదముతో నమ్మినాఁడ ముద్దుల కృ. 97

క. శిరమున రత్న కిరీటము
కరయుగమున శంఖచక్ర ఘనభూషణముల్
యురమున వజ్రపుపతకము
సిరినాయక యమరవినుత శ్రీహరి కృ. 98

క. అందెలు పాదములందున
సుందరముగ నుంచినావు సొంపలరంగా
మందరధర మునిసన్నుత
నందునివరపుత్ర నిన్ను నమ్మితి కృ. 99

క. కందర్పకోటి సుందర
మందరధర నామతేజ మధుసూదనరో
సుందరవిగ్రహా మునిగణ
వందిత మిము దలతు భక్తవత్సల కృ. 100

క. అనుదినము కృష్ణశతకము .
వినిన పఠించినను ముక్తి వేడుక గలుగున్
ధనధాన్యము గోగణములు
తనయులు నభివృద్ధిబొందు తద్దయు కృ. 101

క. భారద్వాజస గోత్రుడ
గారవమున గంగమాంబ కరుణాసుతుడన్
పేరున్నృసింహాహ్వయుడన్
శ్రీరమణా నన్నుగావు సృష్టిని కృ. 102

సంపూర్ణము.

13685